# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో కృతిమ మేధ –ఏఐ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి యోగా అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.**
4. **రాష్ట్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.**

==========================

రాష్ట్రంలో కృతిమ మేధ –ఏఐ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో బహుళజాతి సంస్థ ఎన్‌విడియాతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ సంస్థ ద్వారా కృతిమ మేధలో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. రాష్ట్రం నుంచి 500 ఏఐ స్టార్టప్‌లు ప్రారంభం కానున్నాయని చెప్పారు. విద్య, నైపుణ్యం నుంచి పరిశోధన, ఆవిష్కరణ వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వివరించారు.

--------------------------

ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి యోగా అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం బౌద్ధారామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని యోగాసనాలు వేశారు. ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో యోగా ప్రధాన పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి పేర్కొంటూ..

వాయిస్ ..28 సెకన్లు

--------------------------

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకలను నిర్వహిస్తున్నారు. పండుగ సందర్భంగా మత గురువుల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని

మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా, తిరుపతి జిల్లా గుంటూరు, అనంతపురం జిల్లాలో బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగిన వేడుకల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఐక్యతకు, సహనానికి బక్రీద్ ఒక ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అన్నమయ్య, తూర్పుగోదావరి, నంద్యాల జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని .. మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

వ్యవసాయంలో అధిక దిగుబడిని సాధించేలా రైతులకు అవగాహనా కల్పిస్తున్నామని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ కె. శేషు మాధవ్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషు మాధవ్ మాట్లాడుతూ, ఈ నెల 12 వరకు ఖరీఫ్ సన్నద్ధత ప్రచారాన్ని చేపడుతున్నామని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, స్థిరమైన వ్యవసాయం చేయడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి వివరిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది.

కాగా మే 12 నుంచి 20 వరకు జరిగిన ఈ పరీక్షల్లో లక్షా 35 వేల 826 మంది విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, ద్వితీయ సంవత్సరం 97 వేల 963 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

---------------------------

గత దశాబ్ద కాలంలో భారత్ అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించింది. సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం అనే అంశాల ఆధారంగా గత 11 సంవత్సరాలలో కీలక రంగాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా క్లీన్ ఎనర్జీ రంగంలో భారత్ పురోగతి గురించి ఈరోజు తెలుసుకుందాం.

..వాయిస్...40 సెకన్లు

---------------------------

ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 45 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో కలిసి కేంద్రమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలని కేంద్రమంత్రి వైద్యులకు సూచించారు.

---------------------------

ఖరీఫ్ పంటలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 11.09 లక్షల టన్నుల నిల్వ ఎరువులకు గాను 2 లక్షల టన్నుల విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లోని గోదాముల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ నెలకు సంబంధించి 2.35 లక్షల టన్నుల ఎరువులు కేంద్రం నుంచి వస్తున్నాయని, రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

యువతలో పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. కె.శీనానాయక్ తెలిపారు. విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ రోజు “యోగాంధ్ర 2025” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శీనానాయక్ మాట్లాడుతూ, “ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముఖ్యమైన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ కొద్దిసేపటి క్రితం పేర్కొంటూ...

వాయిస్...28 సెకన్లు

======================